క్లుప్తంగా

వ్యక్తి అదృశ్యం

పాల్వంచరూరల్: వారం రోజుల కిందట వినాయకుడి నిమజ్జనం కోసం వెళ్తున్నట్లు ఇంట్లో భార్యతో చెప్పి వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదు. మండలంలోని నాగారం జీపీ రేపల్లెవాడకు చెందిన వ్యవసాయ కూలీ గంగల తిరపతయ్య (30) ఈ నెల 16వ తేదీన గణేశ్ నిమజ్జనం కోసం వెళ్లి తిరిగి రాలేదు. ఆయిన భార్య సౌజన్య సోమవారం ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

యువతి..

రెండు రోజుల కిందట ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ యువతి తిరిగిరాలేదు. మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన యువతి ఈ నెల 22వ తేదీన ఇంట్లో రూ.300 తీసుకుని వెళ్లిందని, తిరిగి రాలేదని యువతి తండ్రి సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పిచ్చికుక్క దాడి

టేకులపల్లి: మొక్కంపాడుతండాలో పిచ్చికుక్క స్వైర విహారం చేసింది. సోమవారం గ్రామానికి చెందిన బాలుడు అజ్మీర మనోజ్, యువకుడు గుగులోత్ మోతీలాల్ గ్రామంలో వెళ్తుండగా పిచ్చికుక్క అకస్మాత్తుగా వచ్చి దాడి చేసింది. ఈ ఘటనలో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వీరిని వెంటనే కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు.

పోలీసుల తనిఖీలు

పాల్వంచరూరల్: మావోయిస్టు వారోత్సవాల్లో భాగంగా పోలీసులు ఏజెన్సీ ప్రాంత గ్రామాల్లో సోమవారం ముమ్మరంగా తనిఖీలు నిర్వహించారు. మండలంలోని ఉల్వనూరు, చంద్రాలగూడెం గ్రామాల్లో ప్రధాన రహదారిపై వాహనాలను రూరల్ ఎస్‌ఐ సురేశ్, పోలీసు సిబ్బంది తనిఖీ చేశారు.

క్రీడా దుస్తుల వితరణ

జూలూరుపాడు: జోనల్ క్రీడలకు ఎంపికైన జూలూరుపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం మందా రంజిత్‌కుమార్ క్రీడా దుస్తులను వితరణగా అందించారు. హైదరాబాద్ జేఎన్టీయూలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా జూలూరుపాడు గ్రామానికి చెందిన మందా రంజిత్‌కుమార్ పనిచేస్తున్నారు. హెచ్‌ఎం లక్ష్మీనర్సయ్య, మందా నర్సయ్య, పుల్లయ్య పాల్గొన్నారు.

ఏఐటీయూసీ కృషితోనే..

టేకులపల్లి: ఏఐటీయూసీ కృషి ఫలితంగానే సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులకు లాభాల్లో వాటా ప్రకటన వచ్చిందని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి దేవరకొండ శంకర్, నాయకుడు గుగులోత్ రాంచందర్ తెలిపారు. టేకులపల్లిలోని సింగరేణి కాలనీలో సోమవారం జరిగిన కాంట్రాక్ట్ కార్మికుల సమావేశంలో వారు మాట్లాడారు. శివయ్య, జాటోత్ భోజ్య, సూర్య, సోమయ్య, రవి, భద్రయ్య, బాబు, శివ, జ్యోతి, మౌనిక, శారద, కౌసల్య, ఎర్రమ్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ మోటార్ల వితరణ

జూలూరుపాడు: మండలంలోని కరివారిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని బాడవపోడు, కరివారిగూడెం కాలనీల్లో బోర్ బావి వేయించి, విద్యుత్ మోటార్లను సోమవారం ఊటుకూరి నాగేశ్వరరావు వితరణ చేశారు. కరివారిగూడెం శ్రీ వేణుగోపాలస్వామి ఆలయంలో లైట్లు, శ్రీముత్యాలమ్మ తల్లి ఆలయానికి రంగులు వేయించి, లైట్లు ఏర్పాటు చేయించారు.

ఇంటర్వ్యూలు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఖాళీగా ఉన్న పలు కాంట్రాక్ట్ మెడికల్ స్పెషలిస్ట్ పోస్టులకు అర్హులైన వైద్యులకు సోమవారం సింగరేణి డైరెక్టర్ పీఅండ్‌పీ వెంకటేశ్వరరెడ్డి ఇంటర్వ్యూలు నిర్వహించారు. సింగరేణి హెడ్డాఫీస్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి మీడియాను అనుమతించకపోవడంతో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

ఘనంగా జరపాలి

పాల్వంచ: శ్రీదేవి నవరాత్రులను ఘనంగా జరపాలని డీసీఎంఎస్ చైర్మన్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. అక్టోబర్ 3 నుంచి ప్రారంభం కానున్న శ్రీదేవి నవరాత్రులను పురస్కరించుకుని సోమవారం బొల్లేరుగూడెం రామాలయం సెంటర్‌లో భద్రాకాళి యూత్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉత్సవ మండప నిర్మాణ పనులు, కర్రపూజా కార్యక్రమంలో కొత్వాల పాల్గొన్నారు. కొండం వెంకన్న, వై.వెంకటేశ్వర్లు, సురేశ్, యశ్వంత్, శ్రీకాంత్, సాగర్, సాయి పాల్గొన్నారు.

జయప్రదం చేయండి..

జూలూరుపాడు: ఈనెల 30న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో జరిగే మహాధర్నాను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా నాయకుడు కూరాకుల నరసింహారావు పిలుపునిచ్చారు. సోమవారం జూలూరుపాడులో ఎఫ్‌టీయూ నాయకులు మహాధర్నా వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు.

రాష్ట్ర కమిటీలో స్థానం

జూలూరుపాడు: ఆటో వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జూలూరుపాడుకు చెందిన పత్తిపాటి మహేశ్ ఎన్నికయ్యారు. కొత్తగూడెంలో జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆటో, క్యాబ్, ప్రైవేట్ మోటార్ డ్రైవర్స్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర మహాసభల్లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా మహేశ్‌ను రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నారు.

ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు

- ఇల్లెందులో మంత్రి పొంగులేటి పర్యటన
- రహదారులు, స్విమ్మింగ్‌పూల్, బుగ్గవాగు ప్రక్షాళన పనులకు శంకుస్థాపన
- ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో చిల్డ్రన్ పార్క్ ప్రారంభం



బుగ్గవాడు ప్రక్షాళన పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి, పక్కన ఎంపీ బలరాం, ఎమ్మెల్యే కనకయ్య, కలెక్టర్ పాటిల్, ఐటీడీఏ పీఓ రాహుల్, మున్సిపల్ చైర్మన్ డీవీ తదితరులు

ఇల్లెందు: రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇల్లెందులో సోమవారం పర్యటించారు. ఉదయమే ఇల్లెందు చేరుకున్న ఆయనకు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు ఇంటి వద్ద కౌన్సిలర్లు, నాయకులు, అధికారులు స్వాగతం పలికారు. అనంతరం ఎమ్మెల్యే కోరం కనకయ్య, ఎంపీ బలరాం నాయక్, కలెక్టర్ జితేష్ వి పాటిల్, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మువ్వా విజయబాబు, మున్సిపల్ చైర్మన్ డీవీ తదితరులతో కలిసి అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

ఎక్కడెక్కడ ఏయే పనులు...

ఇల్లెందు మండలంలోని ముకుందాపురంలో ముకుందాపురం – కట్టుగూడెం– చెన్నెంగులగడ్డ వరకు ఎస్డీఎస్‌డీఎఫ్ నిధులు రూ.5కోట్లతో ఏడు కి.మీ. మేర నిర్మించే రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఆతర్వాత మామిడిగుండాల పంచాయతీ మేడికుంట నుంచి రామచంద్రాపురంకు సీఎస్‌ఆర్ గ్రాంట్స్ రూ.80 లక్షలతో చేపట్టే రోడ్డు పనులను ప్రారంభించారు. కాగా, స్థానికుల విజ్ఞప్తితో మసివాగుపై బ్రిడ్జి నిర్మాణానికి అంచనా రూపొందించాలని అధికారులకు సూచించారు. ఓ మహిళ జీవనోపాధి కోసం కుట్టు మిషన్ కోరగా వెంటనే మంజూరు చేశారు. అనంతరం ఇల్లెందులోని చెరువు కట్ట వద్ద డీఎంఎఫ్‌టీ నిధులు రూ.కోటితో నిర్మించే స్విమ్మింగ్ పూల్, రహదారి, టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.13.60 కోట్ల చేపట్టే బుగ్గవాగు ప్రక్షాళన పనులు, మోడల్ మార్కెట్‌లో రూ.50 లక్షలతో నిర్మించే రోడ్డు, డ్రెయిన్ నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో టీయూఎఫ్‌ఐడీసీ నిధులు రూ.కోటితో నిర్మించిన చిల్డ్రన్స్ పార్క్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా పార్క్‌లో కలియదిరగడమే కాక ఓపెన్ జిమ్‌లో పరికరాలను పరిశీలించారు. ఈ పర్యటనలో డీఆర్‌డీఓ విద్యాచందన, కమిషనర్ యాదగిరి, వైస్ చైర్మన్ జానీపాషా, కౌన్సిలర్లు, అధికారులు కె.రవికుమార్, ధన్‌సింగ్ తదితరులు పాల్గొనగా డీఎస్పీ చంద్రబాను, సీఐ బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఓపెన్ జిమ్‌లో మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే, ఎంపీ

లేబర్ కోడ్ ప్రతుల దహనం



ఇల్లెందురూరల్: దహనం చేస్తున్న నాయకులు



టేకులపల్లి: ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

ఇల్లెందురూరల్: కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన నాలుగు లేబర్‌కోడ్‌లను తక్షణం రద్దు చేయాలని కోరుతూ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో లేబర్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా చేశారు. ప్రభుత్వ విధానాలకు నిరసనగా లేబర్‌కోడ్ ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం కార్మిక హక్కులకు భంగం వాటిల్లే విధంగా నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను పరిరక్షించుకునేందుకు కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమిస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నాయకులు అబ్దుల్ నబీ, ఆలేటి కిరణ్, బందం నాగయ్య, దేవరకొండ శంకర్, నాయిని రాజు, గౌని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

జీవో కాపీలు దహనం

పాల్వంచరూరల్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట కోడ్‌ల ప్రతులను దహనం చేశారు. అనంతరం తహసీల్దార్ వివేక్‌కు వినతిపత్రం అందజేశారు.

లేబర్ కోడ్లు రద్దుచేయాలి

టేకులపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని కార్మిక సంఘాల జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం టేకులపల్లి తహసీల్ ఎదుట ధర్నా నిర్వహించి లేబర్ కోడ్‌ల ప్రతులను దహనం చేశారు. అనంతరం జేఏసీ నాయకులు డి.ప్రసాద్, గుగులోతు రామచందర్, కడుదుల వీరన్న, జర్పుల సుందర్ మాట్లాడుతూ.. కార్మిక వర్గం కొట్లాడి సాధించుకున్న చట్టాలను కేంద్రం రద్దు చేసి కోడ్‌లను తీసుకురావడం సరికాదన్నారు. ప్రభుత్వం ఈ కోడ్‌లను వ్యతిరేకిస్తూ అసెంబ్లీ తీర్మానం చేయాలని కోరారు. నాయకులు సిరికొండ నాగేశ్వరరావు, కత్తుల ఎర్రయ్య, తావూరియా, జనక్ ప్రసాద్, బోడ మంచా, మదార్ తదితరులు పాల్గొన్నారు.

పుస్తకాలు పంపిణీ

కొత్తగూడెంఅర్బన్: స్వచ్ఛతా హి సేవా (గాంధీ జయంతి)ని పురస్కరించుకొని సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో రెడ్యూస్ రియూజ్ రీసైకిల్ క్యాంపును నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల నుంచి పాత పుస్తకాలు, పాత పెన్నులు తీసుకొని వాటికి బదులుగా కొత్త పుస్తకాలు, కొత్త పెన్నులను పంపిణీ చేశారు. దీంతో పాటుగా పాతకొత్తగూడెం ఏరియాలోని రీసైకిల్ ప్లాంట్‌లో శ్రమదానం చేసి కమిషనర్ శేషాంజన్‌స్వామి మొక్కలను నాటారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పరమేశ్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వీరభద్రాచారి, అశోక్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సొసైటీ నగదు అందజేత

కొత్తగూడెంఅర్బన్: నెల రోజుల కిందట అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొంది తిరిగి ఇంటికి వచ్చిన కానిస్టేబుల్‌కు సొసైటీ డబ్బును కమిటీ సభ్యులు అందజేశారు. చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించే కృష్ణను సోమవారం పోలీస్ సొసైటీ సభ్యులు పరామర్శించారు. కృష్ణ ప్రస్తుతం విధులకు హాజరు కాలేకపోతున్న క్రమంలో సొసైటీ నిబంధనల ప్రకారం రూ.50 వేలను కుటుంబ ఖర్చుల నిమిత్తం అందజేశారు. రామారావు, అశోక్, చంద్రశేఖర్, పంజయ్య, మోహన్, రమేశ్, లక్ష్మణ్, కృష్ణ పాల్గొన్నారు.

హెడ్డాఫీస్ ఎదుట ధర్నా

సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు బ్లాకులను సింగరేణికే కేటాయించాలని హెడ్డాఫీస్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఐఎన్‌టీయూసీ నాయకులు సంఘీబావం తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడారు. సుదీర్ఘ అనుభవం కలిగిన ప్రభుత్వ రంగ సంస్థ అయిన సింగరేణికి బొగ్గు బ్లాకులను కేటాయించాలని కోరారు. కేంద్రంలోని మోదీ సర్కార్ యథేచ్ఛగా నల్లచట్టాలను తీసుకొచ్చి కార్మిక హక్కులను కాలరాస్తోందని ఆరోపించారు.

తప్పుదోవ పట్టించొద్దు..

సింగరేణి(కొత్తగూడెం): లాభాల విషయంలో కొన్ని కార్మిక సంఘాలు యువ కార్మికులను తప్పుదోవ పట్టిస్తున్నాయని, లాభాల్లో కంపెనీ విస్తరణకు పెట్టుబడుల మినహాయింపుపై పనికట్టుకొని తప్పుడు ప్రచారం చేయటం సరికాదని ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కొత్తగూడెంలోని శేషగిరిభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. రమణమూర్తి, క్రిష్టాఫర్, సందెబోయిన శ్రీనివాస్, వీరస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణిలో మేనేజ్‌మెంట్ ట్రెయినీ (మైనింగ్)ల నియామకానికి నిర్వహించిన పరీక్ష ప్రశ్నపత్రంలో తప్పుల సవరణకు చర్యలు తీసుకోవాలని పలువురు అభ్యర్థులు కోరారు. ఈ సందర్భంగా కొత్తగూడెంలో ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రశ్నపత్రంలో తప్పులు వచ్చాయని అభ్యంతరాలు వ్యక్తం చేస్తే సరిచేస్తామని చెప్పినా అలా చేయకుండా ఫలితాలు వెల్లడించారన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలి

పాల్వంచ: విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జి.సుకృత అన్నారు. సోమవారం స్థానిక నవలిమిటెడ్ ఆధ్వర్యంలో రోహిణి ఫౌండేషన్ హైదరాబాద్ సహకారంతో పాత పాల్వంచ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కొమ్ముగూడెం, కరకవాగు, పాలకోయతండా, పాత పాల్వంచ విద్యార్థులకు దంత పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సుకృత, ఫౌండేషన్ సభ్యులు డాక్టర్ అలేఖ్య మాట్లాడుతూ ఓరల్ కేర్ ఐరన్ హెల్తీ చైల్డ్ అనే కార్యక్రమంలో భాగంగా దంత పరీక్షలు నిర్వహించామని చెప్పారు. నవ లిమిటెడ్ జనరల్ మేనేజర్ సురేశ్‌చంద్ర మాట్లాడుతూ విద్యాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని వెల్లడించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సత్యనారాయణరెడ్డి, మొబైల్ టీం సభ్యులు కె.రాజేశ్వరరావు, కె.రాజేశ్, ఎస్.శ్రీకాంత్, ఎస్.శ్రీనివాసరావు, కె.వెంకయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత

సాహిత్యంతో జ్ఞానం పొందొచ్చు..

ఇల్లెందురూరల్: సాహిత్యం చదవడం ద్వారా ప్రపంచ జ్ఞానాన్ని పొందవచ్చని, ప్రతి ఒక్కరూ విద్యార్థి దశ నుంచే సాహిత్యాభిలాషను పెంచుకోవాలని సిటీ కళాశాల తెలుగుశాఖ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ జె.నీరజ అన్నారు. మండలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో «గురుజాడ అప్పారావు – సాహిత్య రచనలు» అనే అంశంపై సోమవారం సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ.. తెలుగు భాష, భావ సాహిత్య ప్రక్రియల సంస్కరణలకు స్త్రీలు విద్యావంతులైన నాడే ఆధునిక ప్రపంచంలో మహిళా చరిత్రను పునర్లిఖిస్తుందని ప్రకటించిన దార్శనికుడు గురుజాడ అప్పారావు అని కీర్తించారు. ప్రపంచ సాహిత్య అత్యుత్తమ రచనలో కన్యాశుల్కం వెలకట్టలేనిదని, ఆ రచన చేసిన గురుజాడ గొప్ప సంస్కరణవాది అని ప్రశంసించారు. కార్యక్రమంలో అధ్యాపకులు పడిగిపల్లి వెంకటేశ్వర్లు, ప్రభాకర్‌రావు, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ వెంకటేశ్వరరావు, శేఖర్, రాజు, సరిత తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఏరియా జీఎం

ఇల్లెందు: సింగరేణి సంస్థ ఇల్లెందు ఏరియా పరిధిలో స్పెషల్ క్యాంపెయిన్ 4.0 కార్యక్రమంలో భాగంగా జీఎం మొక్కలు నాటారు. సోమవారం పట్టణంలోని మహబూబాబాద్ చెక్‌పోస్టు, సీహెచ్‌పీ ఏరియాలో మొక్కలు నాటి మాట్లాడుతూ ఈ నెల 16 నుంచి 30 వరకు ప్రిపరేషన్ ఫేస్ట్‌లో భాగంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పని ప్రదేశాల్లో పరిసరాల పరిశుభ్రత, కార్యాలయాలు, కాలనీల సుందరీకరణ, మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవటం లాంటివి ఇందులో భాగమని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌ఓటూ జీఎం బొల్లం వెంకటేశ్వర్లు, డీజీఎం సివిల్ రవికుమార్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, పర్యావరణ అధికారి ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న జీఎం జాన్‌ఆనంద్

స్వచ్ఛమైన నీరు తాగాలి

పాల్వంచరూరల్: గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీటిని సేవించడం ద్వారా అతిసారా, టైఫాయిడ్, కలరా వంటి వ్యాధులను నివారించవచ్చని ఎంపీడీఓ కె.వి జయభాస్కరరెడ్డి సూచించారు. మండలంలోని తోగ్గూడెం వద్ద గల మిషన్ భగీరథ గ్రీడ్‌లో గ్రామ పంచాయతీ సిబ్బందికి భగీరథ తాగునీటి సరఫరాపై నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఎంపీడీఓ ప్రారంభించారు. అనంతరం గ్రీడ్ డీఈ సాయి సరఫరా జరిగే మంచినీటి నాణ్యతను చెక్ చేయడం, హ్యాండ్ పంపు రిపేర్, క్లోరినేషన్‌పై శిక్షణ ఇచ్చారు. కాగా, మండలంలోని ప్రభాత్‌నగర్‌లోని ఎస్టీకాలనీలో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. బి.నారాయణ, నీలావతి, రామకృష్ణ, రంగా, రాంబాబు, బాబు పాల్గొన్నారు.

ఆటల్లోనూ సత్తా చాటాలి..

పాల్వంచ: విద్యార్థి దశ నుంచి చదువుతో పాటు క్రీడల్లోనూ నైపుణ్యం చాటాలని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. పట్టణంలోని శ్రీనివాసకాలనీ క్రీడా మైదానంలో జరుగుతున్న జిల్లా స్థాయి టెన్నిస్ పోటీల్లో విజేతలను ఆదివారం సాయంత్రం ప్రకటించారు. విద్యార్థి విభాగంలో ప్రవస్తి ప్రథమ, భానుశ్రీ ద్వితీయ, దేశ్వంత్ తృతీయ స్థానంలో నిలిచారు. 45 ఏళ్ల విభాగంలో భద్రాచలం టీం సలీం, దిలీప్, ఏటీపీ టీం అన్నం వెంకటేశ్వర్లు, యుగంధర్‌రెడ్డి, 35 ఏళ్ల విభాగంలో నవభారత్ టీం నాగరాజు, అశోక్, ఏటీపీ టీం భాస్కర్, కబీర్లను జాయింట్ టీం విజేతలుగా ప్రకటించారు. అనంతరం ఎమ్మెల్యే క్రీడలకు సహకారం అందిస్తున్న కొత్తగూడెం వాసి బొర్రా నరేశ్‌ను సన్మానించారు. స్పాన్సర్‌లుగా నిలిచిన బీఎస్ రావు, కృష్ణారావు, అబ్బాస్‌ను అభినందించారు. అనంతరం విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సుకృత, టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షులు యుగంధర్‌రెడ్డి, వై.వెంకటేశ్వర్లు, కృష్ణారావు, భాస్కర్, కబీర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల బారి నుంచి రక్షించవచ్చు...

చుంచుపల్లి/కొత్తగూడెంరూరల్: గ్రామాల్లో మంచి నీటి సహాయకులు చురుకుగా పనిచేస్తే ప్రజలకు వ్యాధులు రాకుండా అడ్డుకట్ట వేయవచ్చని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. మండల కేంద్రంలోని రైతువేదికలో మంచినీటి గ్రామ సహాయకుల నాలుగు రోజుల శిక్షణ కార్యక్రమంలో భాగంగా సోమవారం మంచినీటి నాణ్యత శిక్షణ నిర్వహించగా ఎమ్మెల్యే హాజరై ప్రసంగించారు. గ్రామసహాయకుల సేవలు కొనియాడారు. అనంతరం మిషన్ భగీరథ గ్రిడ్, ఇంట్రా ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నళిని, తిరుమలేశ్ మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రతిరోజూ మంచి నీటి ట్యాంకుల వద్ద ప్రజలకు వ్యాధులు రాకుండా క్లోరినేషన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు బ్రహ్మదేవ్, శివయ్య, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు వెంకటస్వామి, వసంత, నీటి నాణ్యత ప్రయోగశాల టెక్నీషియన్ వరుణ్, నజీర్, ప్రవీణ్ పాషా తదితరులు పాల్గొన్నారు. కాగా, పట్టణానికి చెందిన వైద్యుడు విజేందర్‌రావు సంతాప సభకు కూడా ఎమ్మెల్యే హాజరయ్యారు. కార్యక్రమంలో కంచర్ల చంద్రశేఖర్‌రావు, వైద్యులు నాగరాజు, కనకరాజు పాల్గొన్నారు.



పాల్వంచ: బొర్రా నరేశ్ దంపతులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే కూనంనేని

నాలుగు గోడలకు పరిమితం కావొద్దు..

సింగరేణి(కొత్తగూడెం): విద్యార్థులు చదువుతో పాటు ఆట, పాటల్లో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి పేరు తేవాలని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆకాంక్షించారు. సోమవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని రుద్రంపూర్ జెడ్పీహెచ్ఎస్‌లో 68వ స్కూల్ జోనల్ గేమ్స్‌ను ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి, స్పోర్ట్స్ జెండా ఎగురవేసి ప్రారంభించారు. విద్యార్థులు నాలుగు గోడలకే పరిమితం కావొద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ జుంకీలాల్, తహశీల్దార్ కృష్ణ, సీఐ రమేశ్‌కుమార్, 5 మండలాల పీఈటీలు పాల్గొన్నారు. కాగా, కబడ్డీ, వాలీబాల్, ఖోఖోల్లో టేకులపల్లి జట్లు విజయం సాధించాయి.

గ్రామాల్లో వైద్యశిబిరాలు

టేకులపల్లి: సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఉద్యోగులు సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో వైద్యశిబిరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రక్తపరీక్షలు నిర్వహించడంతో పాటు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఇళ్ల ఆవరణలోనే కాకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఉద్యోగులు వజ్జా పార్వతి, చంద్రకళ, గుజ్జ విజయ, కౌసల్యసింగ్, నాగుబండి వెంకటేశ్వర్లు, ధరణి, ఇంద్రజ, చందన, వీరభద్రమ్మ, కమల, నాగలక్ష్మి, రమాకుమారి, అరుణకుమారి, లక్ష్మీబాయి, సుజాత, వెంకటరమణ, స్రవంతి, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రాపురంలో..

జూలూరుపాడు: మండలంలోని వీరభద్రాపురం గ్రామంలో సోమవారం జూలూరుపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్ నిర్వహించారు. ఆదివారం ‘సాక్షి’ దినపత్రికలో ప్రచురితమైన ‘వైద్యశిబిరం నిర్వహించండి’ కథనానికి స్పందించిన పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎస్ రత్నకుమార్, హెచ్‌వీ రాధిక, ఏఎన్ఎం వెంకటముత్యం, సావిత్రి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



జూలూరుపాడు: వీరభద్రాపురంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

జోనల్ క్రీడల్లో విద్యార్థుల సత్తా

పాల్వంచరూరల్: పాల్వంచ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు జోనల్‌స్థాయి పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు కైవసం చేసుకున్నారు. బూర్గంపాడులో సోమవారం జరిగిన జోనల్‌స్థాయి క్రీడాపోటీలకు మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 96 మంది విద్యార్థులు పాల్గొనగా ఇందులో అండర్–14 విభాగం బాలుర కబడ్డీ, వాలీబాల్ పోటీల్లో ప్రథమస్థానం, బాలికల వాలీబాల్ పోటీల్లో ప్రథమ, కబడ్డీలో ద్వితీయస్థానాలు సాధించినట్లు పీడీ హరి తెలిపారు.



వాలీబాల్‌లో ప్రథమస్థానంలో నిలిచిన బాలికల జట్టు

దసరా ఇన్సెంటివ్ ఇవ్వండి..



మాట్లాడుతున్న కేవీ రామారావు

పాల్వంచ: విద్యుత్ ఉద్యోగులు, ఆర్టిజన్‌లకు దసరా ఇన్సెంటివ్ ఇవ్వాలని హెచ్–142 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ రామారావు అన్నారు. సోమవారం కేటీపీఎస్ కాలనీలోని ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ సంస్థలో గతంలో దసరా పండుగకు 15 రోజుల ఇన్సెంటివ్ ఇవ్వడం ఆనవాయితీగా ఉండేదని, గత ప్రభుత్వం దీనిని నిలిపివేసిందన్నారు. కార్యక్రమంలో ఎస్.శ్రీనివాసాచారి, డి.సత్యరాజ్ స్టీవెన్, వెంపటి వెంకటేశ్వర్లు, షేక్.సయ్యద్, ఎస్.నాగభూషణం, ఎర్రగడ్డ ప్రసాద్, వేణు, కోటేశ్వరరావు, ఉపేందర్, పీవీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

వారసులకు నియామక పత్రాలు

సింగరేణి(కొత్తగూడెం): మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మికుల వారసులకు సోమవారం కొత్తగూడెం సింగరేణి ఏరియా జనరల్ మేనేజర్ ఎం.శాలేంరాజు నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కంపెనీ ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అంతర్గత పరీక్షల ద్వారా పదోన్నతులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు శ్రీరమేశ్, శివకేశవరావు, నరసింహారావు, సదానందం, వెంకటేశ్వరరావు, ఎం.శ్రావణ్‌కుమార్, గౌస్, మధుకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నియామకపత్రాలు అందుకున్న వారితో జీఎం, అధికారులు